ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801

S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు

● ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న ఉదయనిధి

పెరంబూర్, అక్టోబరు 1: క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు తొలివిడతగా వంద మంది క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం మొదటి కార్యక్రమంగా విరుదునగర్ జిల్లాలో జరిగిన ప్రభుత్వ సంక్షేమ సహాయాల పంపిణీ కార్యక్రమంలో ఉదయనిధి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ట్రోఫీ క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన 2,111 మందికి రూ.42.96 కోట్ల విలువైన బహుమతులు అందజేశారు. ముందుగా, 255 మంది దివ్యాంగులకు రూ.45.39 కోట్ల విలులైన ఉచిత ఇళ్లపట్టాలు, మరో 20 మంది దివ్యాంగులు స్వయం ఉపాధి పొందేలా రుణసాయాన్ని ఉప ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం చెన్నై బయట మొదటి కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. మదురైలో ఫిబ్రవరి జరిగిన కలైంజర్ క్రీడా పరికారాలు అందజేసే కార్యక్రమం ప్రారంభించామని, ఈ కార్యక్రమంలో 18 జిల్లాల్లోని అన్ని గ్రామాలకు క్రీడా పరికరాలు అందజేశామని తెలిపారు.

చెస్‌కు గర్వకారణం రాష్ట్ర క్రీడాకారులు..

దక్షిణ జిల్లాలు అంటేనే ధైర్యసాహసాలకు పేరుతో పాటు వీర క్రీడాకారులకు కూడా ప్రసిద్ధి చెందాయన్నారు. ఎంతోమంది క్రీడాకారులను తయారుచేసిన జిల్లాలు కాగా, మరెందరో ఈ జిల్లాల నుంచి వస్తున్నారఅన్నారు. చెస్‌లో రాష్ట్రానికి చెందిన గుహేష్, ప్రజ్ఞానంద, వైష్ణవి, శ్రీనాధ్ అంతర్జాతీయంగా రాణిస్తూ రాష్ట్రానికి మంచి గుర్తిపు, గౌరవం, కీర్తి తెస్తున్నారని అభినందించారు. మూడేళ్లలో 1,300 మంది క్రీడాకారులకు రూ.38 కోట్లను ప్రోత్సాహక నిధిగా ముఖ్యమంత్రి అందజేశారని తెలిపారు. అలాగే, క్రీడాకారుల కోరిక మేరకు 100 మంది క్రీడాకారులకు త్వరలో ప్రభుత్వ ఉద్యోగాలు అందించనున్నామన్నారు. ఖేలో ఇండియా, కార్ రేస్ తదితరాలను రాష్ట్రప్రభుత్వం విజయవంతంగా నిర్వహించిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు, వాణిజ్య శాఖ మంత్రి మూర్తి, విరుదునగర్ కలెక్టర్ జయశీలన్, అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్ర, మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అడయార్‌లో శివాజీ విగ్రహం ఎదుట నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రులు, శివాజీ కుటుంబ సభ్యులు

నడిగర్ తిలకానికి ఘన నివాళులు

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): తమిళ చిత్రసీమలో తన అద్భుత నటనతో నవరసాలను పండించి నడిగర్ తిలకంగా కోట్లాదిమంది అభిమానుల హృదయాల్లో సుస్థిర స్థానం కలిగిన మహానటుడు శివాజీగణేషన్ 97వ జయంతి వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. అడయార్ దేశ్‌ముఖ్ రోడ్డులోని శివాజీ స్మారకమండపం వద్ద జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, రాష్ట్ర మంత్రులు, సమాచార శాఖ అధికారులతో కలిసి స్మారక మండపంలో శివాజీ కాంస్య విగ్రహం వద్దనున్న చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో శివాజీ కుటుంబీకులైన నటుడు ప్రభు, ఆయన కుమారుడు విక్రమ్ ప్రభు, శివాజీ ఫిలిమ్స్ అధినేత రామ్‌కుమార్, సినీ గేయరచయిత వైరముత్తు, మంత్రులు ఎం సుబ్రమణ్యం, పీకే శేఖర్‌బాబు, మేయర్ ఆర్ ప్రియా, ఎంపీలు తమిళచ్చి తంగపాండ్యన్, శాసనసభ్యులు డి.వేలు, ఏఎంవీ ప్రభాకర్‌రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, సమాచార శాఖ కార్యదర్శి రాజారామన్, డైరెక్టర్ ఇరా వైద్యనాధన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం స్మారక మండపం లోపల శివాజీ ఫొటో ప్రదర్శనను ముఖ్యమంత్రి సందర్శించారు. ఆ సందర్భంగా శివాజీ వివిధ సినిమాల్లో నటించిన దృశ్యాలను ప్రదర్శించారు.

టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో...

రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై పార్టీ ప్రముఖులతోపాటు శివాజీ స్మారకమండపం వద్ద విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్‌లో జరిగిన శివాజీ జయంతి వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి పార్టీ ప్రముఖులకు పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో టీఎన్‌సీసీ కళావిభాగం అధ్యక్షుడు కె.చంద్రశేఖరన్, ఎంజీఆర్ ఫిలిమ్‌సిటీ ఛైర్మన్, నటుడు రాజేష్, టీఎన్‌సీసీ కోశాధికారి రూబీ మనోహరన్, డిప్యూటీ అధ్యక్షులు గోపన్నా, సొర్ణ సేతురామన్, కె.విజయన్, కీళనూరు రాజేంద్రన్, రామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.అడయార్‌లో శివాజీ స్మారక మండపం వద్ద శివాజీ విగ్రహం వద్ద టీఎన్ మాజీ అధ్యక్షుడు ఎస్ తిరునావుక్కరసర్, డీసీసీ నేత అడయారు దురై, చెన్నై వెస్ట్ జిల్లా శాఖమాజీ అధ్యక్షుడు అరుంబాక్కం వీరపాండ్యన్, కరాటే రవి తదితరులు నివాళులర్పించారు.



సత్యమూర్తి భవన్‌లో కేక్ కట్ చేస్తున్న సెల్వపెరుంతగై

గాంధీ మండపంలో బ్రాందీ సీసాలా?

● గవర్నర్ దిగ్భ్రాంతి

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా ప్రారంభించిన 'స్వచ్ఛతా హీ సేవా 2024' పిలుపుమేరకు గవర్నర్ ఆర్ఎన్ రవి మంగళవారం ఉదయం రాజ్‌భవన్‌కు చేరువలో ఉన్న గాంధీ మండప ప్రాంతాన్ని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సేవా సంఘాల కార్యకర్తలతో కలిసి శుభ్రం చేశారు. గవర్నర్ సుమారు గంటసేపు ఆ ప్రాంతంలో చెత తొలగించారు. ఆ సందర్భంగా ఓ చోట పడి ఉన్న మద్యం సీసాలు చూసి దిగ్భ్రాంతి చెందారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జాతిపిత మహాత్మాగాంధీ స్వాతంత్ర్య సమర యోధుడు మాత్రమే కాదని, ఆయన పరిశుభ్రత ప్రాధాన్యత లోకానికి చాటిన మహానాయకుడన్నారు. తాను గాంధీ మండపంలో పరిసరాలను శుభ్రం చేస్తుండగా కొన్ని ఖాళీ మద్యం సీసాలు పడి ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందానని తెలిపారు. ఇలా పవిత్రమైన గాంధీ మండప ప్రాంగణాన్ని కళంకపరిచేలా దుండగులెవరో మద్యం సీసాలు పారవేసి వెళ్లడం గర్హనీయమని అన్నారు.



గాంధీ మండప ప్రాంతంలో చెత్త తొలగిస్తున్న గవర్నర్



పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న గవర్నర్ రవి

బైకును ఢీకొన్న లారీ

● తండ్రి, కుమార్తె సహా ముగ్గురి మృతి

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా మల్లూరు వద్ద మోటారు బైకును లారీ ఢీకొనడంతో తండ్రి, కుమార్తె సహా ముగ్గురు మృతి చెందారు. పనమరత్తుపట్టికి చెందిన చెన్నన్ (65), ఆయన కుమార్తె సుధా (38), ఆమె కుమారుడు విష్ణు (12) మంగళవారం వేకువజామున సమయపురం మారియమ్మన్ కోవిల్‌కి బైకులో మల్లూరు బయలుదేరారు. సేలం - నామక్కల్ జాతీయ రహదారిలో మల్లూరు జంక్షన్ రోడ్డు వద్ద సేలం నుంచి నామక్కల్ వెళ్తున్న లారీ అదుపుతప్పి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో చెన్నన్, సుధా, విష్ణు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించారు.. మల్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ సుందరరాజన్ (57)ను పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్ఎస్ఎస్ ర్యాలీకి గ్రీన్‌సిగ్నల్

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 52 చోట్ల ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహించేందుకు హైకోర్టు కొన్ని నిబంధనలతో అనుమతిచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో ఆర్ఎస్ఎస్ ర్యాలీలకు అనుమతి నిరాకరించకూడదని, అదే సమయంలో కొత్త నిబంధనలు విధిస్తూ కాలయాపన చేయకూడదని పోలీసుశాఖను హెచ్చరించింది. విజయదశమి సందర్భంగా ఈ నెల 6న రాష్ట్రంలోని 58 ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించడానికి అనుమతి మంజూరు చేసేలా పోలీసు శాఖకు ఉత్తర్వులివ్వాలని కోరుతూ ఆర్ఎస్ఎస్ నేతలు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణ న్యాయమూర్తి జయచంద్రన్ ఎదుట విచారణకు వచ్చింది. ఆ సందర్భంగా పోలీసు శాఖ తరఫు న్యాయవాది హాజరై 58 ప్రాంతాలకు బదులుగా 52 చోట్ల ఆర్ఎస్ఎస్ ర్యాలీకి అనుమతిచ్చినట్లు తెలిపారు. చెన్నై మాంగాడు, కొరట్టూరు, కోవై రత్నపురి తదితర ప్రాంతాల్లో బహిరంగ సభలు జరిపేందుకు ఆయా పాఠశాలల యాజమాన్యం అంగీకరించలేదన్నారు. మెట్రోరైలు పనుల కారణంగా మేడవాక్కంలోను, ట్రాఫిక్ రద్దీ కారణంగా సేలయూరులో, కులశేఖరపట్టినంలో దసరా వేడుకల కారణంగా తూత్తుకుడి జిల్లా సాయర్‌పురంలోనూ ర్యాలీకి అనుమతి ఇవ్వలేదని పోలీసుశాఖ న్యాయవాది తెలిపారు. ఆ తర్వాత న్యాయమూర్తి జయచంద్రన్ ఉత్తర్వు జారీ చేస్తూ ఆర్ఎస్ఎస్ ర్యాలీ నిర్వహణకు సంబంధించి జనవరిలోనే హైకోర్టు నిబంధనలు విధించిందని, ఆ ప్రకారం ఆర్ఎస్ఎస్‌కు అనుమతివ్వొచ్చని, భవిష్యత్‌లో ర్యాలీకి అనుమతి నిరాకరించకూడదని ఆదేశించారు. సేలయూరుకు బదులు చిట్లపాక్కంలో ర్యాలీ నిర్వహించేందుకు ఆర్ఎస్ఎస్ కోరితే అనుమతివ్వాలని. మేడవాక్కంలో ప్రత్యామ్నాయ మార్గంలో ర్యాలీ జరిపేందుకు అనుమతించాలని కూడా ఉత్తర్వులిచ్చారు. భవిష్యత్తులో ర్యాలీ మార్గాల్లో కొన్ని మతాలవారు అధికంగా నివసిస్తున్నారనే సాకుతో అనుమతిని నిరాకరించకూడదని కూడా హెచ్చరించారు.





ఆ 10 శాతం ఓట్లు మళ్లీ వస్తే విజయం ఖాయం

● ఈపీఎస్ ధీమా



అన్నాడీఎంకే ఐటీ విభాగం సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే 10 శాతం ఓట్లు కోల్పోవటం వల్ల ఓటమి పాలైందని, ఆ ఓట్లను మళ్లీ పొందగలిగితే సునాయాసంగా గెలుస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో జరిగిన అన్నాడీఎంకే ఐటీ విభాగం నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో సమాచార సాంకేతిక విభాగాలు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని, దేశంలో ఐటీ విభాగాన్ని మొదట ప్రారంభించిన రాజకీయ పార్టీగా అన్నాడీఎంకే రికార్డులకెక్కిందన్నారు. ప్రస్తుతం పార్టీకి వ్యతిరేకంగా ఓ పథకం ప్రకారం ప్రత్యర్థులు అసత్య వార్తలను వ్యాపింపజేస్తున్నారని, వాటిని అన్నాడీఎంకే ఐటీ విభాగమే సమర్థవంతంగా ఖండించాలని, అవన్నీ తప్పుడు వార్తలంటూ ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 15 మాసాల గడువే ఉందనే విషయం గుర్తుంచుకుని పార్టీ ఐటీ విభాగం సమర్థవంతంగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలకు సంబంధించిన సెల్‌ఫోన్ సందేశాల ద్వారా ప్రజలందరికీ చేరేలా ఐటీ విభాగం పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నత్తం విశ్వనాథన్, కేపీ మునుసామి, ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుసేన్, దిండుగల్ శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

8న మంత్రివర్గ సమావేశం

ప్యారీస్, అక్టోబరు 1:ముఖ్యమంత్రి స్టాలిన్ అధ్యక్షతన 8వ తేది మంత్రివర్గ సమావేశం జరుగుతుందని సచివాలయం మంగళవారం ప్రకటించింది. సెయింట్ జార్జి కోట ప్రాంగణంలో సచివాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగనున్న ఈ సమావేశంలో తాజాగా బాధ్యతలు స్వీకరించిన మంత్రులతో పాటు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో రాష్ట్రాభివృద్ధికి చేపట్టాల్సిన పథకాలు, ప్రస్తుతం విజయవంతంగా కొనసాగుతున్న పథకాలు, ముఖ్యంగా విదేశాల నుంచి భారీస్థాయిలో రాష్ట్రానికి రాబట్టుకున్న పెట్టుబడులు తదితర కీలక అంశాల గురించి చర్చించే అవకాశముందని సచివాలయ వర్గాలు తెలిపాయి.

డిమాండ్ల సాధన కోసం మొబైల్ ఫ్యాక్టరీ కార్మికుల రాస్తారోకో

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) కాంచీపురం జిల్లా సుంకువారిసత్రం వద్దనున్న మొబైల్ ఫోన్ల కార్మాగారంలో ఇటీవల ఏర్పాటైన సీఐటీయూ కార్మిక సంఘానికి గుర్తింపు నివ్వాలని, కార్మికుల వేతనాలు పెంచాలని కోరుతూ కార్మికులు గత కొద్ది రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీ యాజమాన్యంతో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో మంగళవారం ఉదయం సుమారు 400 మంది కార్మికులు గాంధీ విగ్రహం వద్ద ధర్నాకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని కార్మికులందరినీ అరెస్టు చేసి బస్సుల్లో తరలించారు. ఇదిలా ఉండగా కాంచీపురంలోని మొబైల్ ఫ్యాక్టరీ యాజమాన్యం సీఐటీయూ కార్మికసంఘానికి గుర్తింపునివ్వాలని కోరుతూ ఆ కార్మిక సంఘానికి చెందిన కార్యకర్తలు మదురైలో మంగళవారం ఉదయం రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ మదురై జిల్లా అధ్యక్షుడు ఆర్.థైవ రాజ్, జిలా కార్యదర్శి ఆర్.లెనిన్ నాయకత్వంలో పెరియర్ బస్టాండు సమీపం కట్టబొమ్మన్ విగ్రహం ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు 200 మంది రాస్తారోకో నిర్వహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు జోక్యం చేసుకుని అందరినీ అరెస్టు చేశారు.



కాంచీపురంలో రాస్తారోకో చేస్తున్న మొబైల్ ఫ్యాక్టరీ కార్మకులు



మదురైలో మొబైల్ ఫ్యాక్టరీ కార్మికులకు మద్దతుగా ధర్నా చేస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

6న ఎయిర్ షో

● విమానాల రాకపోకల్లో మార్పులు

అడయార్, అక్టోబరు 1: స్థానిక మెరీనా తీరంలో ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు భారత వైమానిక దళం ఎయిర్ షో జరుగనున్న నేపథ్యంలో 25 విమాన రాకపోకల్లో మార్పులు చేశారు. మెరీనా తీరంతో పాటు తాంబరం వైమానిక దళంలో ఈ షో జరుగనుంది. ఇందుకోసం రిహార్సల్స్ మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. రిహార్సల్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా 15 నిమిషాల నుంచి 2 గంటల పాటు విమాన సేవలను నిలిపివేస్తామని ఎయిర్‌పోర్టు అధికారులు వెల్లడించారు.



ఎయిర్‌షో రిహార్సల్స్‌లో పాల్గొన్న యుద్ధవిమానాలు

సమాచార దర్శిని

14 నుంచి బీఎడ్ కౌన్సెలింగ్

ఐసిఎఫ్, అక్టోబరు 1: స్థానిక లేడి వెల్లింగ్టన్ కళాశాల ప్రాంగణంలో బీఎడ్ కౌన్సెలింగ్ ఈ నెల 14 నుంచి ప్రారంభం కానుంది. ఈ ఏడాది బీఎడ్ కోర్సుల్లో రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ కళాశాలల్లో 900 సీట్లు, 14 ఎయిడెడ్ కళాశాలల్లో 1,140 సీట్లు కౌన్సెలింగ్ ద్వారా భర్తీకానున్నాయి. 3,486 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, ఇటీవల విడుదల చేసిన ర్యాంకుల జాబితాలో 2,187 మంది అర్హత సాధించారు. వీరికి ఈ నెల 14 నుంచి 19వ తేది వరకు ట్రిప్లికేన్ లేడి వెల్లింగ్టన్ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగనుంది. విద్యార్థులు ఏఏ తేదీల్లో హాజరుకావాలో గురువారం నుంచి ఎస్ఎంఎస్ పంపించనున్నట్లు అధికారులు తెలిపారు.

స్మార్ట్ ఫోన్ పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఐసిఎఫ్, అక్టోబరు 1: స్మార్ట్ ఫోన్ పొందేందుకు దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంధులు, బధిరులకు ప్రభుత్వం ఉచితంగా స్మార్ట్ ఫోన్లు అందజేయనుంది. దివ్యాంగులు ఈ-సేవా కేంద్రాల్లో ఏదైనా ఒక గుర్తింపుకార్డుతో వారం రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

డిసెంబరు 31లోపు దోవతి, చీరల తయారీ పూర్తికావాలి

ఐసిఎఫ్, అక్టోబరు 1: ప్రభుత్వం ఉచితంగా అందజేయనున్న ధోవతి, చీరల తయారీ డిసెంబరు 31వ తేది లోపు పూర్తిచేయాలని ఆదేశించారు. సంక్రాంతిని పురస్కరించుకొని ప్రభుత్వం వీటిని రేషన్‌కార్డుదారులకు అందజేస్తోంది. ఈరోడ్, నామక్కల్, తిరుప్పూర్, కోయంబత్తూర్ జిల్లాల్లో ధోవతి, చీరల తయారీ జరుగుతోంది. డిసెంబరు నెలాఖరులోగా పనులు పూర్తిచేయాలని నేత సంఘాలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

6న సైక్లోథాన్ పోటీలు

ఐసిఎఫ్, అక్టోబరు 1: రాష్ట్ర క్రీడాభివృద్ధి కమిషన్, హెచ్‌సీఎల్ సంయుక్తంగా చెన్నై సైక్లోథాన్ 2024 పోటీని ఈ నెల 6వ తేది నిర్వహించనున్నారు. స్థానిక ఈసీఆర్ రోడ్డులోని కానత్తూర్ మాయాజాల్ థియేటర్ నుంచి ప్రారంభమయ్యే ఈ సైక్లోథాన్ మహాబలిపురం ప్రభుత్వాస్పత్రి జంక్షన్ వరకు సాగనుంది. 18 నుంచి 35 ఏళ్లలోపున్న క్రీడాకారులకు 15,24,55 కి.మీ విభాగాల్లో పోటీలు జరుగనున్నాయి.

ఎస్‌కేపీడీలో నవరాత్రి, విడయాత్తి ఉత్సవాలు

ప్యారీస్, అక్టోబరు 1: స్థానిక జార్జిటౌన్ ఆదియప్ప నాయకన్ వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో ఈ నెల 3 నుంచి 12వ తేది వరకు నవరాత్రి, 14 నుంచి 22వ తేది వరకు విడయాత్తి ఉత్సవాలు నిర్వహించనున్నారు. నవరాత్రుల సందర్భంగా వాసవి అమ్మవారు వివిధ అలంకారంలో దర్శనమివ్వనున్నారు. ప్రతిరోజు భరతనాట్యం, భక్తిసంగీతం, పారాయణం, అభిషేకం, మూలమంత్ర హోమం తదితర పూజలు నిర్వహించనున్నారు. విడయాత్తి ఉత్సవంలో 9 రోజులు అమ్మవారిని బంగారు, వెండితో అలంకరించనున్నారు. ఈ రెండు ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేపట్టినట్లు ఎస్‌కేపీడీ చారిటీస్ ట్రస్టీలు తెలిపారు.

రేపటి నుంచి సరస్వతి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

ప్యారీస్, అక్టోబరు 1: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం సమీపం ఆర్యపాక్కంలో ఉన్న విద్యారంభ జ్ఞాన మహాసరస్వతి ఆలయంలో ఈ నెల 3 నుంచి 12వ తేది వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం భారీ ఏర్పాట్లు చేపట్టారు. 10 రోజుల ఉత్సవాల్లో సరస్వతి దేవి అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ముఖ్యాంశమైన అక్షరాభ్యాస కార్యక్రమం 12వ తేది శనివారం జరుగనుంది. ఈ పూజలో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా ఆలయ ధర్మకర్త పీవీ కృష్ణారావు, గురుస్వామి భక్తవత్సలం పిలుపునిచ్చారు.

గిండి ఎస్టేట్‌లో 120 దుకాణాలకు సీలు

ఐసిఎఫ్, అక్టోబరు 1: స్థానిక గిండి ఎస్టేట్‌లో 120 దుకాణాలకు అధికారులు సీలు వేశారు. ఈ ఎస్టేట్‌లో సూక్ష్మ, చిన్న వృత్తి సంస్థలు పనిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ సంస్థలు కొరియర్, హోటల్ వంటి ఇతర దుకాణాలు అద్దెకిస్తున్నాయి. వీటిని గుర్తించిన అధికారులు 120 దుకాణాలకు నోటీసులిచ్చారు. వాటిని తొలగించకపోవడంతో సోమవారం సీలు వేశారు.

ఒకే ధరకు బాణసంచా విక్రయాలు

ఐసిఎఫ్, అక్టోబరు 1: సహకార దుకాణాల్లో ఒకే ధరకు బాణాసంచా విక్రయించాలని ఆ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీపావళిని పురస్కరించుకొని తాత్కాలిక బాణసంచా విక్రయ దుకాణాలను సహకార శాఖ ప్రారంభించనుంది. వాటిలో మార్కెట్ ధర కన్నా తక్కువ ధరకు విక్రయించనున్నారు. దుకాణాలు ఏర్పాటు, విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలను సహకార సంఘాల రిజిస్ట్రార్ సుబ్బయ్యన్ విడుదల చేశారు.

112 ప్రాంతాల్లో 'ఎడిస్' దోమల ఉత్పత్తి

ఐసిఎఫ్, అక్టోబరు 1: రాష్ట్రంలో డెంగ్యూ జ్వరం వ్యాపింపజేసే ఎడిస్ దోమలు 112 ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్నట్లు ఆరోగ్యశాఖ తనిఖీల్లో వెల్లడైంది. రాష్ట్రంలో శీతోష్ణస్థితుల కారణంగా జ్వరాలు పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించేందుకు ఆరోగ్యశాఖ చర్యలు చేపడుతోంది. అన్ని జిల్లాల్లో 8,351 ప్రాంతాల్లో లార్వాలు సేకరించి వాటిని పరిశోధనకు పంపించారు. వాటిలో 112 ప్రాంతాల్లో ఎడిస్ దోమల ఉత్పత్తి ఉన్నట్లు గుర్తించారు. ఈ విషయమై ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ... ఒక్కో జిల్లాల్లో 15 రోజులకొకసారి అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారని, వ్యాధులకు గురైన వారికి వైద్య పరిశోధనలు నిర్వహించి చికిత్సలందిస్తున్నామని తెలిపారు.

2.50 లక్షల మందికి అమెరికా వీసాలు

ఐసిఎఫ్, అక్టోబరు 1: ఈ ఏడాదిలోగా 2.50 లక్షల మంది భారతీయులకు వీసా అందజేసేందుకు అమెరికా ముందుకొచ్చినట్లు దౌత్యాధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమెరికా రాష్ట్రపతి జోబైడెన్ భేటీలో ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు నెలకొనేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో, భారతదేశానికి అమెరికా దౌత్యులు వీసా చర్యలు సులభతరం చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దేశంలో ఉన్న ఐదు దౌత్య కార్యాలయాల ద్వారా అమెరికా చదువుకోనేందుకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన విద్యార్థులు అందరికీ, ఈ సంవత్సరం ఇప్పటివరకు 12 లక్షల మందికి వీసాలు అందజేశారు. మరో మూడు నెలల్లో 2.50 లక్షల మందికి అందజేయనున్నారు.

రూ.48 పెరిగిన వాణిజ్య సిలిండర్

పెరంబూర్, అక్టోబరు 1: వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.48కి పెరిగింది. ఆ ప్రకారం, గత నెల 19 కిలోల వాణిజ్య సిలిండర్ ధర రూ.1855 ఉండగా, రూ.48 పెరగడంతో రూ.1,903కు విక్రయమవుతోంది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ ధరలో ఎలాంటి మార్పు లేదు.

'ఈశాన్యం' ముందస్తు జాగ్రత్త చర్యలు

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల మొదటివారంలోగా రాష్ట్రంలో ఈశాన్య రుతపవనాలు ప్రవేశించి భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో





నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలో 1628 ప్రకటన బోర్డులను తొలగించారు. గతంలో ఈశాన్య రుతపవనాల ప్రభావిత వర్షాల సమయంలో ప్రకటనల బోర్డులు కూలడం వల్ల నగరవాసులకు తీవ్ర ఇబ్బందులు కలుగటంతో ఈ బోర్డులను ముందుగానే తొలగించినట్లు అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా ఉంచిన ప్లకార్డులు, డిజిటల్ బ్యానర్లతోపాటు గోడలపై అంటించిన పోస్టర్లను తొలగించారు. మాధవరం, తేనాంపేట కోడంబాక్కం, వలసరవాక్కం ప్రాంతాల్లో అధిక సంఖ్యలో బ్యానర్లు, ప్లకార్డులను తొలగించినట్లు అధికారులు పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన

● ఆరు నెలల్లో 40వేల డ్రైవింగ్ లైసెన్స్‌ల రద్దు

ప్యారీస్, అక్టోబరు 1: రాష్ట్రంలో గత ఆరు నెలలుగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన 40 వేల మంది డ్రైవింగ్ లైసెన్సులు రద్దయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై ట్రాఫిక్ విభాగం పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు, ట్రాఫిక్ సిగ్నళ్లలో ఆగకుండా వేగంగా వెళ్లేవారు, ఎక్కువ మంది ప్యాసింజర్లను ఎక్కించుకొనే వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదుచేస్తున్నారు. గత ఆరు నెలల వ్యవధిలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకుల డ్రైవింగ్ లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేయాలంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ట్రాఫిక్ విభాగం పోలీసులు అందజేసిన ఈ-చలానా ఆధారంగా ఉల్లంఘనలకు సంబంధించి కేసు నమోదుచేసి జరిమానా కూడా వసూలు చేస్తున్నారు. నిబంధనలు పాటించని వాహనచోదకులకు వివరణ కోరుతూ పంపిణి నోటీసుకు వివరణ ఇవ్వని వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్ తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. ఆ రీతిలో 1.8 లక్షల మందిపై చర్యలు చేపట్టారు. వీరిలో మూడుసార్లు కంటే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన నేరానికి 40,000 మంది డ్రైవింగ్ లైసెన్స్‌లు రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన జాతీయ పౌష్టికాహార ఉత్సవాలు



పిల్లలకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 1: శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో 'పోషన్ అభ్యాన్' పథకం కింద జాతీయ పౌష్టికాహార ఉత్సవాల ముగింపు మంగళవారం జరిగింది. టౌన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుబ్బులక్ష్మి పాల్గొని, డివిజన్ స్థాయిలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన కళాశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, అంగన్వాడీ ఉద్యోగులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ కమిషనర్ సుజాత , 2వ మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్, జిల్లా పథక అధికారి మైథిలి, ఆర్గనైజర్, సీఎంసీ వైద్య కళాశాల మణిమేఘలై, చాముండేశ్వరి సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వడపళనిలో నవరాత్రి ఉత్సవాలు

ఐసిఎఫ్, అక్టోబరు 1: స్థానిక వడపళని సుబ్రమణ్యస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి 12వ తేది వరకు జరుగనున్నాయి. ఈ సందర్భంగా భారీ శక్తి కొలువు ఏర్పాటుచేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుంచి 11.30 గంటలు, సాయంత్రం 6 నుంచి 6.30 గంటల వరకు అమ్మవారి కొలువు సన్నిధిలో ప్రత్యేక పూజలు, దీపారాధన నిర్వహించనున్నారు. 4వ తేది సాయంత్రం 4.15 గంటలకు లలితా సహస్రనామ పారాయణం, 6న తిరుముర్రై పారాయణం, 11వ తేది ఉదయం 7.30 మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు మీనాక్షి అమ్మవారి ఏకదిన లక్షార్చన జరుగనుంది. లక్షార్చనలో పాల్గొనే భక్తులు రూ.250 కార్యాలయంలో చెల్లించి రసీదు పొందాలి. లక్షార్చన పూర్తికాగానే అంబాళ్ ప్రసాదం అందజేస్తారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు జరుగనున్నాయి. శక్తి కొలువును భక్తులు ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు, సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శించవచ్చు. ఉత్సవాల ముగింపు కార్యక్రమంగా 12వ తేది విజయదశమి రోజు విద్యారంభం అనే కార్యక్రమం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనుంది. రెండున్నర నుంచి మూడున్నరేళ్లున్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయనున్నారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు ఘనస్వాగతం

అడయార్, అక్టోబరు 1: అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని నగరానికి వచ్చిన రాష్ట్ర క్రీడాకారులకు క్రీడా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు ఎయిర్‌పోర్టులో సాదర స్వాగతం పలికారు. ఉజ్బెకిస్థాన్‌లో గత నెల 24 నుంచి 29వ తేదీ వరకు ఈ కిక్ బాక్సింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీలకు రాష్ట్రం తరఫున 11 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఆరు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో 81 దేశాలకు చెందిన 2715 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 55 కేజీల జూనియర్ విభాగంలో సుభాషిణి రెండు బంగారు, 47 కేజీల విభాగంలో అశ్విన్ సిల్వర్ మెడల్, 65 కేజీల లైట్ కాంటాక్ట్ అండ్ కిక్ లైట్ విభాగంలో జీవంతికా రెండు రజత పతకాలు, 42 కిలోల విభాగంలో దీపలక్ష్మి, 50 కేజీల విభాగంలో నివేద, సీనియర్ 94 కేజీల విభాగంలో వశీకరన్ పతకాలు సాధించారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ పోటీలకు తమిళనాడు నుంచి ఏకంగా 11 మంది క్రీడాకారులు పాల్గొనడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. 11 మంది క్రీడాకారులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ప్రోత్సాహక నగదు బహుమతిని రాష్ట్ర క్రీడామంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంగళవారం నగరానికి వచ్చిన ఈ క్రీడాకారులకు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. కాగా, అంతర్జాతీయ స్థాయిలో అద్భుతంగా రాణిస్తున్న క్రీడాకారులను రాష్ట్ర క్రీడాశాఖామంత్రి, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ జవాను ఆత్మహత్య

అడయార్, అక్టోబరు 1: స్థానిక తండయారుపేట శాస్త్రినగర్‌కు చెందిన గుణశేఖరన్ (32) అనే సీఆర్‌పీఎఫ్ జవాను ఆత్మహత్య చేసుకున్నాడు. తన మామ దశదిన ఖర్మ రోజునే ఆయన బలవన్మరణానికి పాల్పడటం గమనార్హం. పోలీసుల కథనం మేరకు.. 13 యేళ్లుగా సీఆర్‌పీఎఫ్ జవానుగా పనిచేస్తున్న గుణశేఖరన్.. అదే ప్రాంతానికి చెందిన గోమతి అనే మహిళను ప్రేమవివాహం చేసుకున్నాడు. గత నెల 12వ తేదీన గోమతి తండ్రి, తన మామ అంత్యక్రియల కోసం మణిపూర్ నుంచి నగరానికి వచ్చాడు. అప్పటి నుంచి ఒక్కడే ఉంటున్నాడు. సోమవారం దశదిన ఖర్మ క్రతువు జరిగింది. అయితే గుణశేఖరన్ పీకలవరకు మద్యం సేవించి ఇంటిలోనే ఉండిపోయాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న భార్య గోమతి ఫోన్ చేసి దూషించినట్టు సమాచారం. దీంతో మనస్తాపం చెందిన గుణశేఖరన్ ఇంటిలోనే ఫ్యానుకు ఉరేసుకున్నాడు. దీన్ని గమనించిన బంధువులు గుణశేఖరన్‌ను సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు వెల్లడించారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు తీస్తున్నారు.

స్వచ్ఛ భారత్ డ్రైవ్‌కు విశేష స్పందన



మెరీనా తీరంలో స్వచ్ఛ భారత్ డ్రైవ్‌లో పాల్గొన్న సిబ్బంది

అడయార్, అక్టోబరు 1: రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా 2024 కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్వచ్ఛ భారత్ డ్రైవ్ జరిగింది. నగరంలోని ఆ కంపెనీకి చెందిన 1400 మంది ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యు లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రాష్ట్రంలోని ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జియో సెంటర్లకు చెందిన ఉద్యోగులు 90 ప్రాంతాల్లో ఈ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మెరీనా తీరంతో పాటు పార్కులు, ఆట స్థలాలు, ప్రధాన రవాణా కేంద్రాలు, రైల్వే స్టేషన్లలో ఈ క్లీన్ డ్రైవ్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిరత అంశాలకు రిలయన్స్ ఫౌండేషన్ కట్టుబడివుందని పేర్కొంది.

గ్లెనెగల్స్‌లో చైల్డ్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవం



చైల్డ్ క్యాన్సర్ అవగాహన మాసోత్సవ వేడుకలు

అడయార్, అక్టోబరు 1: నగరంలోని గ్లెనెగల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చైల్డ్ హుడ్ క్యాన్సర్ అవేర్‌నెస్ మాసోత్సవాన్ని మంగళవారం నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్యాన్సర్ మహమ్మారిని జయించిన చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్లెనెగల్స్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ నాగేశ్వర రావు, పీడియాట్రిక్ హెమటాలజీ, అంకాలజీ, బీఎంటీ హెచ్‌వోడీ డాక్టర్ పొన్ని శివప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం టైంటేబుల్‌తో నేడు సబర్బన్ రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 1: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం సబర్బన్ రైళ్లు ఆదివారం టైం టేబుల్ ప్రకారం నడుస్తాయని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట, తిరువళ్లూర్-అరక్కోణం, చెన్నై బీచ్ నుంచి తాంబరం-చెంగల్పట్టుకు సబర్బన్ రైళ్లు, చింతాద్రిపేట నుంచి వేళచ్చేరికి ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుపుతున్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ప్రభుత్వ సెలవు కావడంతో ఆదివారం టైంటేబుల్ ప్రకారం సబర్బన్, ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుస్తాయని అధికారులు తెలిపారు.

రాబోయే పదేళ్లలో వరి సాగు ప్రశ్నార్థకం

పెరంబూర్, అక్టోబరు 1: రాష్ట్రంలో వచ్చే పదేళ్లలో వరి సాగు ప్రశ్నార్థకంగా ఉంటుందని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. తిరుచ్చికి చెందిన వీరపాండి దాఖలుచేసిన పిటిషన్ విచారించిన హైకోర్టు, శివగంగ ఉమ్మడి తాగునీటి పథకంపై హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. ఈ సందర్భంగా న్యాయమూర్తులు... డెల్టా జిల్లాల్లో వరి సాగు గణనీయంగా తగ్గిపోతుందని, పొన్ని తదితర రకాలను రైతులు ఇప్పుడు సాగుచేయడం లేదన్నారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే రాబోయే పదేళ్లలో రాష్ట్రంలో వరి సాగు చేసే అవకాశమే ఉండదని న్యాయమూర్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

7 నుంచి పళని రోప్‌కార్ సేవల నిలిపివేత

పెరంబూర్, అక్టోబరు 1: దిండుగల్‌లో ప్రసిద్ధిచెందిన పళని మురుగన్ ఆలయ రోప్ కార్ సేవలు ఈ నెల 7వ తేది నుంచి 40 రోజులు నిలిపివేయనున్నట్లు అధికారులు ప్రకటించారు. వార్షిక మరమ్మతుల కారణంగా ఈ సేవలు నిలిపివేస్తున్నట్లు, భక్తులు వించ్, మెట్ల మార్గాన్ని వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీబీఐ విచారణకు లైంగిక వేధింపుల కేసు

పెరంబూర్, అక్టోబరు 1: స్థానిక అన్నానగర్‌లో బాలికపై లైంగిక వేధింపుల కేసు విచారణ సీబీఐకి బదిలీ చేశారు. అన్నానగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఈ కేసును సీబీఐ మారుస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. బాలికపై లైంగిక వేధింపుల వ్యవహారాన్ని మద్రాసు హైకోర్టు సుమోటా కేసుగా విచారిస్తోంది.

వైభవంగా 18 సిద్ధుల యాగపూజ



వేలూరు, అక్టోబరు 1: చెంగానత్తం సిద్ధుల కొండపై వెలసిన చక్ర భగవతి అమ్మవారి ఆలయంలో మంగళవారం 18 సిద్ధుల యాగం, లక్ష్మి భగవతి సిద్ధుల స్వామి జయంతి వైభవంగా జరిగాయి. కార్యక్రమంలో సకల దేవతామూర్తులకు అభిషేకం, ఆరాధన, గోపూజ, గురు పూజ తదితరాలు నిర్వహించారు. ఈ వేడుకల్లో అత్తియూర్ వేంబు స్వామి, కుంకుమబొట్టు సిద్ధుడు రాజేంద్ర స్వామి, బాలాజీ, గ్రామస్తులు, వేడుకల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో 5న ప్రశంసాపత్రాల పంపిణీ

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ తెలుగు సమాఖ్య' ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత తెలుగు తరగతుల్లో సుశిక్షితులైన వారికి ప్రశంసా పత్రాల పంపిణీ జరుగనుంది. ఈ నెల 5వ తేదీ టి.నగర్ జీఎన్ చెట్టిరోడ్డులో వున్న అంకుర్‌ప్లాజాలో జరుగనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శిర డాక్టర్ పి.రామ్‌మోహనరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని సమాఖ్య అధ్యక్షురాలు డాక్టర్ వీఎల్ ఇందిరా దత్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

74 కేజీల గంజాయి స్వాధీనం

అడయార్, అక్టోబరు 1: మదురై జిల్లా పేరైయూర్ సమీపంలోని టి కల్లుపట్టి ప్రాంతంలో ఓ ఇంటిలో అక్రమంగా నిల్వవుంచిన 74 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఇంటి యజమాని వెంకటేష్‌ను అరెస్టు చేశారు. టి కల్లుపట్టిలో డీఎస్పీ దుర్గాదేవి నేతృత్వంలో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. వారివద్ద గంజాయి ప్యాకెట్లను గుర్తించి, వాటిపై ఆరా తీయగా, అసలు విషయాన్ని వెల్లడించారు. దీంతో వెంకటేష్ నివాసంలో తనిఖీలు చేయగా, అక్రమంగా నిల్వవుంచిన 74 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు అలాగే, అదుపులోకి తీసుకున్న మునియప్పన్ (38), వెల్లైస్వామి (23)లను కూడా అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బాధ్యతల స్వీకరణ



వేలూరు జిల్లా సీబీసీఐడీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సురేష్‌పాండ్యన్

తిరుపతి వెళ్లే రైళ్లకు అదనపు బోగీలు

పెరంబూర్, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుపతి వెళ్లే భక్తుల సౌకర్యార్థం అదనపు బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.16057/16058 చెన్నై సెంట్రల్-తిరుపతి- చెన్నై సెంట్రల్ (సప్తగిరి ఎక్స్‌ప్రెస్), నెం.16053/16054 డా.ఎంజీఆర్ సెంట్రల్-తిరుపతి-డా.ఎంజీఆర్ సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 2 నుంచి 15వ తేది వరకు, నెం.22616/22615 కోయంబత్తూర్-తిరుపతి-కోయంబత్తూర్ సూపర్‌ఫాస్ట్ రైళ్లకు ఈ నెల 3 నుంచి 15వ తేది వరకు, నెం.22617/22618 తిరుపతి- బెంగళూరు-తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఈ నెల 4 నుంచి 15వ తేది వరకు అదనంగా ఒక జనరల్, ఒక చైర్ కార్ బోగీలు అనుసంధానం చేయనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

ప్రథమ చికిత్సపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జనార్ధనన్

వేలూరు, అక్టోబరు 1: స్థానిక లత్తేరి ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ కాట్పాడి శాఖ అధ్యక్షుడు జనార్ధనన్ పాల్గొని, శుభ్రత, ఆరోగ్యం, ప్రథమ చికిత్స తదితరాలను వివరించారు. కార్యక్రమానికి కల్వి ఉలగం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివవడివు అధ్యక్షత వహించగా, ప్రధానోపాధ్యాయులు వరదరాజన్, ఉపాధ్యాయులు గోవిందరాజ్, కృష్ణమూర్తి, జయకుమార్, రఘుపతి తదితరులు పాల్గొన్నారు. భాగంగా ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు పాఠశాల, ప్రాంగణాల్లో స్వచ్ఛభారత్ చేపట్టారు.

కళాకారులకు ఐఐటీ మద్రాసు అడ్మిషన్లలో రిజర్వేషన్లు

ఐసిఎఫ్, అక్టోబరు 1: ఐఐటీ మద్రాసు అడ్మిషన్లలో కళాకారులకు రిజర్వేషన్ కల్పించనున్నట్లు డైరెక్టర్ కామకోటి తెలిపారు. మైలాపూర్‌లోని బీఎస్ఎస్ పాఠశాలలో తంజావూరు అనిరుధ్ దేవా అనే బాలుడి మృదంగ అరంగేట్రం జరిగింది. ఈ కార్యక్రమంలో మృదంగ విద్వాన్ ఉమయాల్‌పురం శ్రీనివాసన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఐటీ మద్రాసు డైరెక్టర్ కామకోటి మాట్లాడుతూ... ఐఐటీ అడ్మిషన్లలో గత సంవత్సరం క్రీడాకారులకు రిజర్వేషన్ కల్పించామని, ఐదుగురు ఛాంపియన్లు ఐఐటీలో చేరారని తెలిపారు. అలాగే, వచ్చే విద్యా సంవత్సరం నుంచి కళారంగంలో రాణించిన వారికి కూడా రిజర్వేషన్లు కల్పించనున్నామని తెలిపారు.

అన్నా వర్సిటీకి మరోసారి బాంబు బెదిరింపు

అడయార్, అక్టోబరు 1: స్థానిక గిండిలోని అన్నా వర్సిటీకి మంగళవారం 14వ సారి బాంబు బెదిరింపు రావడంతో బాంబ్ స్క్వాడ్ నిపుణులు పోలీసు జాగిలంతో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. అన్నా వర్సిటీ ఈ-మెయిల్‌కు గత ఆరు నెలలుగా వరుసగా బాంబు బెదిరింపు రావడంతో ఆ వర్సిటీ ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. అదే విధంగా కోవిలంబాక్కం-తురైపాక్కం రేడియల్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి, మొగప్పేర్‌లో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు రావడంతో బాంబ్ స్క్వాడ్ నిపుణులు తనిఖీలు నిర్వహించగా, ఇందులో బాంబులేవీ లేకపోవడంతో ఇది ఎవరో పుట్టించిన వదంతులని పోలీసులు నిర్ధారించారు.

ఆరు జిల్లాల్లో సోలార్ పార్క్‌లు

ఐసిఎఫ్, అక్టోబరు 1: చెంగల్పట్టు, తిరువారూర్ సహా ఆరు జిల్లాల్లో సౌర విద్యుత్ పార్క్‌లు ఏర్పాటుచేసేందుకు విద్యుత్ బోర్డు నిర్ణయించింది. రాష్ట్రంలో సంవత్సరానికి 300 రోజులకు పైగా సోలార్ విద్యుత్ లభిస్తోంది. ఇప్పటివరకు 8,180 మెగావాట్ల సామర్థ్యంతో ఈ విద్యుత్ కేంద్రాలను ప్రైవేటు సంస్థలు ఏర్పాటుచేశాయి. వాటిలో ఒకటి కూడా విద్యుత్ బోర్డుకు చెందినది కావు. దీంతో, కార్పొరేషన్, మున్సిపాలిటీ ప్రాంతాలు మినహాయించి తిరువారూర్, కరూర్, నాగపట్టణం, సేలం, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో తలా 50 నుంచి 100 మెగావాటు మొత్తం 4,000 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ పార్క్‌లు ఏర్పాటుచేయనున్నారు. ఈ జిల్లాల్లో 3,300 ఎకరాల స్థలాన్ని ఈ పార్క్‌ల కోసం ఎంపిక చేసినట్లు, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు విద్యుత్ బోర్డు తెలిపింది.

మెట్రోలో 92.77 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, అక్టోబరు 1: నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో సెప్టెంబరు నెలలో 92.77 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు సీఎంఆర్ఎల్ విడుదల చేసిన ప్రకటనలో... మెట్రోరైళ్లలో జనవరిలో 84,63,384 మంది, ఫిబ్రవరిలో 86,15,008 మంది, మార్చిలో 86,82,457 మంది, ఏప్రిల్‌లో 80,87,712 మంది, మేలో 84,21,072 మంది, జూన్‌లో 84,33,837 మంది, జూలైలో 95,35,019 మంది, ఆగస్టు నెలలో 95,43,625 మంది ప్రయాణించారు. అలాగే, సెప్టెంబరులో 92,77,697 మంది ప్రయాణించగా, ఆ నెలలో 6వ తేది అధికంగా 3,74,087 మంది ప్రయాణించారు. ఆ ప్రకారం ఆగస్టు నెలతో పోల్చితే సెప్టెంబరులో 2,65,928 మంది తగ్గినట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

రైతు సంఘం కార్యదర్శికి నివాళి

వేలూరు, అక్టోబరు 1: గుడియాత్తం తాలూకా తట్టపారై గ్రామంలో మంగళవారం అఖిల భారత రైతు సంఘం తరఫున శ్రీనివాసరావు జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో దశరథన్, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు పాండురంగన్, వ్యవసాయ కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు రామరాజన్, నిర్వాహకులు గుణశేఖరన్, స్వామినాథన్ సహా సంఘ సభ్యులు, రైతులు పాల్గొని శ్రీనివాసరావు చిత్రపటానికి నివాళులర్పించారు.

పర్యాటక వాహనాలకు ఈ-పాస్ విధానం పొడిగింపు

అడయార్, అక్టోబరు 1: దిండుగల్ జిల్లా కొడైకెనాల్, నీలగిరి జిల్లా ఊటీ వచ్చే పర్యాటకుల వాహనాలకు ఈ-పాస్ విధానం పొడిగించారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెకర్లు విడుదల చేసిన ప్రకటనలో.. మద్రాసు హైకోర్టు ఉత్తర్వులతో కొడైకెనాల్ వచ్చే పర్యాటక వాహనాలకు ఈ-పాస్ తప్పనిసరి విధానం మే 7వ తేది నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ విధానం రెండు విడతలు పొడిగించగా, ఆదివారంతో గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఈ విధానం కొనసాగుతుందని, పర్యాటకులు epass.tnega.org అనే వెబ్‌సైట్ ద్వారా తగిన దస్తావేజులు సమర్పించి ఈ-పాస్ పొందవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిర్‌పోర్టులో నక్షత్ర తాబేళ్ల స్వాధీనం

● ఇద్దరి అరెస్టు

ప్యారీస్, అక్టోబరు 1: మలేసియా దేశం నుంచి విమానంలో నగరానికి అక్రమంగా తరలించిన సుమారు 5 వేలకు పైగా నక్షత్ర తాబేళ్లను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. మలేసియా రాజధాని కౌలాలంపూర్ నుంచి మలేసియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఆదివారం అర్ధరాత్రి త్రిశూలంలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చింది. అందులో వచ్చిన ప్రయాణికుల లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. పెద్ద ప్లాస్టిక్ బుట్టతో వచ్చిన నగరానికి వచ్చిన ఇద్దరు ప్రయాణికులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. ఆ బుట్టలో చాక్లెట్లు, బిస్కెట్లు, పిల్లలు ఆడుకొనే బొమ్మల కింద దాచిన సుమారు 5,000లకు పైగా ఎరుపు రంగు చెవులు కలిగిన నక్షత్ర తాబేళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ రకం తాబేళ్లను విదేశాల నుంచి రాష్ట్రానికి తరలించడం చట్టవిరుద్ధం కావడంతో ఆ తాబేళ్లను మంగళవారం ఉదయం నగరం నుంచి కౌలాలంపూర్‌కు బయల్దేరిన విమానం ద్వారా తిరిగి పంపించారు.

క్రీడాకారులకు సత్కారం



శివన్ అగర్వాల్, శ్రీవత్సన్‌లను సత్కరిస్తున్న దృశ్యం

అడయార్, అక్టోబరు 1: ఇటీవల పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ వేదికగా జరిగిన 31వ ఆసియన్ జూనియర్ ఇండివిడ్యుల్ స్క్వాష్ చాంపియన్‌షిప్ పోటీల్లో బంగారుపతాకాన్ని గెలుచుకున్న 15 యేళ్ళ శివన్ అగర్వాల్, చెస్‌లో అండర్ యూ10లో స్వర్ణపతకం సాధించిన ఆర్.శ్రీవత్సన్‌లను అంబికా ఎంపైర్ హోటల్ నిర్వాహకులు సత్కరించారు. హోటల్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా హాలీవుడ్ నటి కోమల్ శర్మ, హోటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అంబికా రాజా, జనరల్ మేనేజర్ కళాధినాథన్, అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ పుష్పలత, మేనేజర్ మోహన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఉదయనిధికి శుభాకాంక్షల వెల్లువ

ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సినీ నటుడు ఉదయనిధికి తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా అభినందనలు తెలుపుతున్నారు. మరికొందరు స్వయంగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్నారు. మంగళవారం ఉదయనిధిని ఆయన స్నేహితుడు, కోలీవుడ్ హీరో శివకార్తికేయన్, ప్రముఖ హాస్య నటుడు వడివేలు కలుసుకుని అభినందనలు తెలిపారు. సచివాలయానికి వెళ్ళిన వీరిద్దరు డిప్యూటీ సీఎం చాంబరులోనే ఉదయనిధికి బెస్ట్ విషెస్ చెప్పారు. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. అదేవిధంగా నడిగర్ సంఘం, తమిళనాడు చలనచిత్ర నిర్మాతల మండలి, కోలీవుడ్ దర్శక సంఘం ఇలా తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక సినీ ప్రముఖులు ఉదయనిధిని అభినందిస్తున్నారు.

చిత్రజ్యోతి

ఉదయనిధికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న శివకార్తికేయన్

మణికంఠన్ కొత్త చిత్రం 'కుటుంబస్థన్'

సినిమాకారన్ పతాకంపై నిర్మాత ఎస్.వినోద్ కుమార్ సమర్పణలో రాజేశ్వర్ కలిసామి దర్శకత్వంలో మణికంఠన్ హీరోగా నటించే కొత్త చిత్రానికి 'కుటుంబస్థన్' అనే టైటిల్ ఖరారు చేశారు. 'గుడ్‌నైట్, 'లవర్' వంటి వరుస హిట్ సినిమాలను తన ఖాతాలో వేసుకున్న మణికంఠన్ ఆచితూచి కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా మరో మంచి కథ ఎంచుకుని హీరోగా నటించారు. హాస్యం, వినోదంతో పాటు వాస్తవిక అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే మూవీగా తెరకెక్కించారు. ఈ సినిమా గురించి దర్శకుడు రాజేశ్వర్ మాట్లాడుతూ, 'కోయంబత్తూరు నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో నవ దంపతుల ఆనందకర జర్నీ నేపథ్యంలో సాగుతుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. సాన్వే మేఘన, గురు సోమసుందరం, ఆర్.సుందరరాజన్, ప్రసన్న బాలచంద్రన్, ప్రసిద్ధ తదితరులు నటించారు' అని పేర్కొన్నారు.



'కుటుంబస్థన్' ఫస్ట్‌లుక్

హిజ్రా దర్శకత్వంలో 'నీల నిర సూరియన్'

● కోలీవుడ్‌లో తొలిసారి

తమిళ చిత్రపరిశ్రమలో తొలిసారి ఒక హిజ్రా దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి 'నీల నిర సూరియన్' అనే పేరు ఖరారు చేయగా, ఈ నెల 4వ తేదీ విడుదల చేస్తున్నారు. ఒకానొక సమయంలో చిత్రాల్లో హిజ్రాలను హేళన చేస్తూ, హాస్య సన్నివేశాల కోసమే వారిని వాడుకునేవారు. ఇపుడు ఆ పరిస్థితి మారిపోయింది. పలువురు హిజ్రాలు పలు చిత్రాల్లో ముఖ్య పాత్రలు పోషిస్తూ తమ ప్రతిభను వెండితెరపై నిరూపించుకుంటున్నారు. ఈ కోవలోనే హిజ్రా సంయుక్తా విజయన్ దర్శకత్వ బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేశారు. ఆమె రూపొందించిన 'నీల నిర సూరియన్'లో గీతా కైలాసం, గజరాజ్, మషాంత్ ప్రధాన పాత్రలు పోషించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శించగా అనేక అవార్డులను సొంతం చేసుకుంది. ఈ సినిమా గురించి సంయుక్తా విజయన్ మాట్లాడుతూ, 'పురుషుడు ఒక స్త్రీగా మారడం మాత్రమేకాకుండా, వారిని సమాజం ఏ దృష్టితో చూస్తుంది? ఎదురయ్యే ఆటంకాలు ఎలా అధిగమించి ముందుకుసాగుతున్నారు? వంటి అంశాలతో రూపొందించాం. ఈ నెల 4వ తేదీన విడుదల చేస్తున్నాం' అని పేర్కొన్నారు.



కెప్టెన్ వాయిస్ వల్లే అవకాశాలు

● నటుడు టీఎస్‌కే

చిన్న వయసు నుంచే దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ వాయిస్‌తో మిమిక్రీ చేయడంతో తనకు సినిమా అవకాశాలు వస్తున్నాయని, ఆ కారణంగానే మూడుపూటలా భోజనం దొరుకుతుందని నటుడు టీఎస్‌కే అంటున్నారు. హరీష్ కళ్యాణ్, సంజన జంటగా తమిళరసన్ పచ్చముత్తు దర్శకత్వంలో వచ్చిన 'లబ్బర్ పందు' చిత్రంలో విలన్‌గా నటించిన టీఎస్‌కే మంగళవారం కోయంబేడులోని విజయకాంత్ సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఆయన కెప్టెన్ సతీమణి, డీఎండీకే అధ్యక్షురాలు ప్రేమలతను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చిన్న తనం నుంచే కెప్టెన్ వాయిస్‌తో మిమిక్రీ చేస్తూ వచ్చాను. దాని ఆధారంగా సినిమాల్లో అవకాశాలను అందిపుచ్చుకునే స్థాయికి ఎదిగాను. తాజాగా విడుదలై ఘనవిజయం సాధించిన 'లబ్బర్ పందు' చిత్రంలో భాగస్వామి కావడం సంతోషంగా ఉంది. దీనికి కారణంగా దివంగత కెప్టెన్ విజయకాంత్ ఆశీర్వాదం. కెప్టెన్ భౌతికంగా మనమధ్య లేకపోయినా ఆయన ఏదో ఒక రూపంలో మన మధ్య ఉన్నారని నేను బలంగా నమ్ముతాను. ఏదో ఒక రూపంలో మనలను నిశితంగా చూస్తూ, ఆశీర్వదిస్తున్నారని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు.



విజయకాంత్ సమాధికి టీఎస్‌కే నివాళులు

బొమ్మల కొలువుకు వేళాయె..!

నవరాత్రి వేడుకలకు సిద్ధమవుతున్న విగ్రహాలు











అయోధ్యరాముడి విగ్రహాన్ని చూస్తున్న మహిళలు

బొమ్మలను ఆసక్తిగా తిలకిస్తున్న మహిళలు - లక్ష్మీ, దుర్గ, సరస్వతి బొమ్మలు

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వచ్చిందంటే చాలు రాష్ట్రంలోని పలు నగరాల్లో బొమ్మల కొలువుకు సంబంధించిన రంగురంగుల బొమ్మల విక్రయాలు ఊపందుకుంటాయి. నవరాత్రి ఉత్సవాల్లో వివిధ రకాల బొమ్మల ద్వారా భారతీయ సంస్కృతులను చాటిచెప్పే విధంగా, పౌరాణిక గాథలను తెలిపేలా బొమ్మల కొలువులు ఏర్పాటు చేస్తారు. దీనికి ఓపిక చాలా అవసరం. తమకు నచ్చిన మట్టితో తయారై వివిధ రంగుల దేవతా మూర్తుల విగ్రహాలను ఎంపిక చేసుకుని మార్కెట్లలో కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యంగా పల్లె సీమలను తలపించేలా ఎడ్లబండి నడిపే రైతు, పంట నూర్పిడి చేసే రైతు, మడక దున్నే రైతు, ఏతాము తొక్కే రైతు అంటూ కర్షకుడి కష్టాలను తెలిపే అందమైన బొమ్మలు నాలుగైదు దశాబ్దాల కింద బొమ్మల కొలువులో పెట్టేవారు. ప్రస్తుతం శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం పెరగటంతో కంప్యూటర్ ఆపరేటర్, మొబైల్ ఫోన్‌తో మాట్లాడే

● పూంపుహార్‌లో జోరుగా విక్రయాలు

బాలుడు, రాకెట్ నమూనా పట్టుకునే బాలుడు, పుస్తకాలు పట్టుకునే విద్యార్థి ఇలా వింత బొమ్మలు కూడా కొలువుదీరుతున్నాయి. బొమ్మల ఎంపికలో నేడు ఎన్నో మార్పులు వచ్చినా వినాయకుడు, లక్ష్మీదేవి, చిన్ని కృష్ణుడు, శ్రీరాముడు వంటి దేవతామూర్తుల బొమ్మలు తప్పకుండా కొలువులో స్థానం పొందుతాయి. ఆంజనేయుడు, మహిసాసుర మర్థిని, రాజు, రాణి, పెండ్లి ఊరేగింపు బొమ్మలు తంజావూరు తలాడించే బొమ్మలు, నాట్యం చేసే మగువ బొమ్మలు, జంతువుల బొమ్మలు, కాయగూరల బొమ్మలు కూడా బొమ్మల కొలువులో కనువిందు చేస్తాయి. రాష్ట్రంలో నవరాత్రి వేడుకల కోసం రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ 'పూంపుహార్' బొమ్మల ప్రదర్శన, అమ్మకాలను ప్రతియేటా క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. ఈ కొలువు బొమ్మలు రాష్ట్రంలోని తంజావూరు తదితర నగరాల నుంచే కాకుండా ఆంధ్ర ప్రదేశ్‌లోని కొండపల్లి, చెన్నపట్న, ఏటికొప్పాక కొయ్య బొమ్మలు, కర్ణాటక, కోల్‌కతా, రాజస్థాన్, పుదుచ్చేరి నుంచి తెప్పించిన అందమైన బొమ్మలు కూడా ఈ సంస్థ విక్రయిస్తోంది. ఈ సారి బొమ్మకొలువులో అయోధ్య రాముడి బొమ్మలకు గిరాకీ బాగా పెరిగింది. ఈ కొలువుబొమ్మలకు పూంపుహార్ సంస్థ 10 శాతం రాయితీతో విక్రయిస్తోంది. ఈ సారి కొలువు బొమ్మల అమ్మకాల ద్వారా సుమారు కోటి రూపాయల ఆదాయం లభిస్తుందని ఎదురు చూస్తున్నామని పూంపుహార్ సంస్థ అధికారులు తెలిపారు.



ముద్దులొలికే బొమ్మలు

ఆర్ఎంకేవీ శతవార్షిక వేడుకలు

● కొత్తరకం పట్టుచీరల పరిచయం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆర్ఎంకేవీ డైరెక్టర్ మాణిక్యవాసగం

పెరంబూర్, అక్టోబరు 1: పట్టుచీరల తయారీలో పేరెన్నికగన్న ఆర్ఎంకేవీ సంస్థ శతవార్షికోత్సవ వేడుకలు ఇటీవల అడయార్‌లోని గాంధీ నగర్‌లో జరిగాయి. ఈ సందర్భంగా 11 కొత్త పట్టుచీరలను పరిచయం చేస్తూ, ఆర్ఎంకేవీ సంస్థ డైరెక్టర్ మాణిక్యవాసగం, డిప్యూటీ డైరెక్టర్లు మహేష్, శంకర్ కుమారస్వామి సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. ఆర్ఎంకేవీ సంస్థకు నగరంలో మూడు సహా రాష్ట్రవ్యాప్తంగా ఏడు బ్రాంచ్‌లు ఉన్నాయన్నారు. 1942లో తిరునల్వేలిలో, విశ్వనాథపిళ్లై ఆర్ఎంకేవీ తొలి షోరూమ్ ప్రారంభించగా, ఈ ఏడాది శతవార్షికోత్సవాలు జరుపుకుంటున్నామని తెలిపారు. మొట్టమొదటిసారిగా 'సిన్నన్‌సిరు కిళియే' చీరలు పరిచయం చేశామన్నారు. ఈ చీరలు నేటికీ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఇప్పటివరకు సుమారు వంద రకాల చీరలు పరిచయం చేశామన్నారు. సంస్థ శతవసంతాల వేడుకల్లో భాగంగా 11 రకాల పట్టుచీరలు పరిచయం చేశామన్నారు. దేశంలోనే తొలిసారిగా 4,000లకు పైగా ప్రకృతి రంగులతో కూడిన చీరలు పరిచయం చేస్తున్నామన్నారు. కల్పగవృక్షం (ది ట్రీ ఆఫ్ లైఫ్) పేరుతో జరీ అంచు కలిగిన చీరలు ఉన్నాయన్నారు. అలాగే, 'పీచ్ ఫజ్' పేరుతో 'కలర్ ఆఫ్ ది ఇయర్ 2024' సిల్క్ చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ మూడు పట్టుచీరలు, కుంకుడుకాయ, ఉసరికాయ, దానిమ్మ, మల్బరి తదితర 100కు పైగా వృక్షజాలు, ధాతువులు ఉపయోగించి, సహజసిద్ధ రంగులతో తయారుచేసినట్లు వెల్లడించారు. ఈ చీరలు రకాలను బట్టి రూ.20,000 నుంచి రూ.70,000 వరకు ధర ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంకేవీ మేనేజింగ్ డైరెక్టర్ శివకుమార్ సహా పలువురు పాల్గొన్నారు.

మంత్రి నాజర్‌కు టామ్స్ నేతల శుభాకాంక్షలు



మంత్రి నాజర్‌ను సత్కరిస్తున్న విజయకుమార్

ప్యారీస్, అక్టోబరు 1: రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రిగా నియమితులైన ఆవడి ఎస్ఎం నాజర్‌ను తమిళనాడు ఆది ఆంధ్ర అరుంధతీయ మహాసభ (టామ్స్) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆవడిలోని మంత్రి నివాసంలో మంగళవారం కలిసిన టామ్స్ అధ్యక్షుడు నేలటూరి విజయకుమార్, ఇతర నిర్వాహకులు శాలువ కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

గుజరాత్ నుంచి తిరిగొచ్చిన 26 మంది తమిళులు

● సెంట్రల్‌లో మంత్రి స్వాగతం



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో తమిళులకు స్వాగతం పలుకుతున్న మైనారిటీ, ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం నాజర్

చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ రాష్ట్రం భావ్‌నగర్‌కు తీర్థయాత్రగా వెళ్ళి వరదల్లో చిక్కుకున్న 26 మంది తమిళులు మంగళవారం వేకువజాము క్షేమంగా నగరానికి చేరుకున్నారు. గుజరాత్‌లోని మలేశ్రీ వాగులో ఉన్నట్టుండి సంభవించిన వరదల్లో తీర్థయాత్రగా వెళ్ళిన తమిళుల బస్సు చిక్కుకుంది. గుజరాత్ రాష్ట్ర సహాయక బృందం వారిని కాపాడి సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఆ తర్వాత ప్రవాస తమిళుల సంక్షేమ శాఖ అధికారులు గుజరాత్ రాష్ట్ర అధికారులతో సంప్రదించి 26 మందిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చే ఏర్పాట్లు చేపట్టారు. ఆ మేరకు నవజీవన్ ఎక్స్‌ప్రెస్‌లో వారంతా మంగళవారం వేకువజాము చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారికి మంత్రి ఎస్ఎం నాజర్ పుష్పగుచ్చాలు అందజేసి, శాలువ కప్పి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాహనాలలో వారిని స్వస్థలాలకు పంపారు.







మెరీనాలో ఎయిర్ షో రిహార్సల్స్



యుద్ధవిమానాల రిహార్సల్స్

అడయార్, అక్టోబరు 1: స్థానిక మెరీనా తీరంలో ఈ నెల 6వ తేదీ ఎయిర్ షో జరుగనున్న నేపథ్యంలో రిహార్సల్స్ మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా తొలి రోజు రిహార్సల్ పురస్కరించుకుని మంగళవారం మధ్యాహ్నం 1.45 గంటల నుంచి 3.15 గంటల మధ్య సింగపూర్, ఢాకా, జాప్నాలకు వెళ్ళే మూడు ఇంటర్నేషనల్ విమానాలు, 12 డొమెస్టిక్ విమానాలు సాయంత్రం 5.20 గంటలకు పైన బయలుదేరి వెళ్ళేలా సమయాలను మార్పులు చేశారు. అలాగే, చెన్నై ఎయిర్‌పోర్టుకు రావాల్సిన విమాన సర్వీసులను సాయంత్రం 3.15 గంటల తరువాత వచ్చేలా మార్పులు చేశారు. కాగా, తొలిరోజు జరిగిన పాక్షిక రిహార్సల్‌లో మొత్తం 70 విమానాలు పాల్గొన్నాయి. వీటిలో అత్యాధునిక యుద్ధ విమానమైన రఫెల్, తేజస్, సుఖోయ్ 30 ఎంకేఐ, సరంగ్ హెలికాప్టర్, సూర్యకిరణ్ ఏరోనాటిక్స్ బృందం పాల్గొన్నాయి. రెండో రోజు ఓ మోస్తరు రిహార్సల్, నాలుగో తేదీ జరిగే మూడో రిహార్సల్ పూర్తి స్థాయిలో జరుగుతాయని భారత వైమానిక దళం అధికారులు వెల్లడించారు.



శివాజీకి నడిగర్ సంఘం నివాళి



చెన్నై, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణభారత సినీ కళాకారుల సంఘం (నడిగర్ సంఘం) ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి ఆ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం కార్యవర్గ కమిటీ సభ్యులు దళపతి దినేష్, హేమచంద్రన్, నియామక కమిటీ సభ్యులు లలితాకుమారి, సౌందరరాజా, సబితా, ఆనంద్ నారాయణన్, ఆనంద్, కామరాజ్, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చిమురుగన్ తదితరులు



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దక్షిణ భారత ప్రాంతీయ సైనికాధికారి జనరల్ ఆఫీస్ కమాండింగ్ లెఫ్టినెంట్ జనరల్ కరణ్‌బీర్ సింగ్ బ్రార్